క్లుప్తంగా

మరమ్మతు పనుల పరిశీలన



పైపులైను మరమ్మతు పనులను పరిశీలిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్లు

నర్సాపూర్: మున్సిపాలిటీలోని ఆరవ వార్డులో పైపులైన్ మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్‌లు సోమవారం పరిశీలించారు. వార్డులో పైపులైన్ పాడైపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పైపులైన్‌కు మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని వారు సిబ్బందికి సూచించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

రికార్డుల తనిఖీ

చిన్నశంకరంపేట(మెదక్): మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం జెడ్పీ సీఈఓ ఎల్లయ్య తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ బిల్లులకు సంబంధించిన వార్షిక ఆడిట్ నిర్వహించగా అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన కార్యాలయ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఆనంద్ ఉన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం

నర్సాపూర్ రూరల్: మండలంలోని సీతారాంపూర్ ముదిరాజ్ సంఘం మహాసభ నూతన కార్యవర్గాన్ని సోమవారం సంఘం మండలాధ్యక్షుడు నాగభూషణం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ ముదిరాజ్ సంఘం మహాసభ అధ్యక్షుడిగా వడ్డేపల్లి భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా ఎర్ల పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా జోగు పెద్దమల్లేశ్, కోశాధికారిగా ఎర్ల దుర్గయ్య, మరో ఐదు మంది సభ్యులుగా ఎన్నుకున్నారు.

కేజీబీవీ టీచర్‌కు గురుబ్రహ్మ అవార్డు



అవార్డు అందుకుంటున్న మధులత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మెదక్ జిల్లా మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని కేజీబీవీ ఉపాధ్యాయురాలు మధులతకు జాతీయస్థాయిలో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుబ్రహ్మ అవార్డు అందజేశారు. సోమవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్ వల్లూరి శ్రీనివాసరాజు అవార్డును అందజేశారని చెప్పారు.

సీపీఎస్ రద్దు చేయాలి



సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరాంరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రత్నాపూర్‌లో టీపీటీఎఫ్ సభ్యత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే డీఏ విడుదల చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, నారాయణగౌడ్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళం పగులకొట్టి లిక్కర్, నగదు చోరీ

చిన్నశంకరంపేట(మెదక్): వైన్స్ షాప్ తాళం పగులకొట్టి లిక్కర్‌తో పాటు నగదును చోరీ చేసిన సంఘటన మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... గవ్వలపల్లి చౌరస్తాలోని రేణుకమాత వైన్స్‌లో ఆదివారం అర్ధరాత్రి వైన్స్ తాళం పగుల కొట్టి కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.15 వేల నగదును దుండగులు చోరీ చేశారు. అనంతరం వైన్స్‌లోని 24 ఫుల్ బాటిల్స్‌ను ఎత్తుకెళ్లారు. ఈ చోరీ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

కూలిన ఇళ్లకు నిధులు విడుదల

నిజాంపేట(మెదక్): మండల వ్యాప్తంగా వర్షాలకు కూలిన ఇళ్లకు ప్రభుత్వం నిధుల విడుదల చేసిన్నట్లు సోమవారం తహసీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా 42 ఇళ్లు కూలిపోయాయని చెప్పారు. ఈ డబ్బులను వారి బ్యాంక్ అకౌంట్‌లో నేరుగా జమ చేశారన్నారు.

రోడ్డుపై గుంతలు.. నిత్యం గుబులు



నర్సాపూర్ - తూప్రాన్ వైపు నుంచి వచ్చే రోడ్డుపై నిలిచిన నీరు

నర్సాపూర్: రెండు జాతీయ రహదారులు కలిసే చౌరస్తాలో ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరకి వచ్చే దాకా రోడ్లపై గుంతలు కనపడకపోవడంతో వేగంగా వచ్చే వాహనదారులు ఆఖరి నిమిషంలో బ్రేక్‌లు వేస్తున్నారు. దీంతో వెనక వచ్చే వాహనదారులు ముందున్న వాహనాన్ని ఢీ కొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా.. జాతీయ రహదారుల శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. హైదరాబాద్ – మెదక్ జాతీయ రహదారి, సంగారెడ్డి – తూప్రాన్ జాతీయ రహదారులు పట్టణ పరిధిలో కలిసే ప్రధాన చౌరస్తాలో పలు గుంతలు ఏర్పడ్డాయి. సంగారెడ్డి నుంచి చౌరస్తా వైపు వచ్చే చోట పెద్ద గుంత పడడంతో పాటు తారు కొట్టుకుపోయి పలు చిన్న గుంతలు ఏర్పడ్డాయి. పెద్ద గుంతలో నీరు నిల్వడంతో అది ఎంత లోతుగా ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలు అదుపు తప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు. తూప్రాన్ వైపు నుంచి వచ్చే దారిలో ఓ పెద్ద గుంతతో పాటు రోడ్డుకు అడ్డంగా చిన్న కాల్వ ఏర్పడింది. పెద్ద గుంత వద్ద మున్సిపల్ సిబ్బంది ఇటీవల స్టాపర్లు ఏర్పాటు చేయడంతో గుంత పక్క నుంచి వాహనాలు వెళ్తున్నాయి. కాగా రోడ్డుకు అడ్డంగా కాల్వగా ఏర్పడడంతో దాని నిండా వర్షం నీరు నిలిచి కాల్వ ఎంత లోతుగా ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారీన పడుతున్నారు. జాతీయ రహదారులు కలిసే చౌరస్తాలో ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

– తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ, నిమజ్జన సమయాల్లో సరైన జాగ్రత్తలు పాటించాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడి అన్నారు. సోమవారం ఆయన చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగతనాలు అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, ప్రయాణికులకు, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాతంగా నవరాత్రి ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ యాదగిరి ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత



చిలప్‌చెడ్(నర్సాపూర్): మాట్లాడుతున్న సంతోషిమాత

చిలప్‌చెడ్(నర్సాపూర్): సరైన పోషకాహారాలు భుజిస్తేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, మహిళల్లో రక్తహీనత లోపం ఉండదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని శేరికుంట తండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించి, పోషకాహారాలు భుజిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఈ నెల 30 వరకు మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా చిన్నారుల ఎత్తు, బరువు చూసి, లోపం ఉన్న చిన్నారులకు అందించే పోషకాహారాల గురించి వివరించామన్నారు. అదేవిధంగా మహిళల్లో రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పోషకాహారాలను తెలియజేశామన్నారు. ముఖ్యంగా పరిశుభ్రత, ప్రీస్కూల్ విషయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను తల్లులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, ప్రీస్కూల్ టీచర్ శ్రీలత, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ పేర్కొన్నారు. మండలంలోని రుద్రారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియన్‌లో భాగంగా ఆమె మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పోషకాలున్న కూరగాయలు, పప్పులు, గుడ్లు, పాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సలీమా, రాణి, ఏఎన్ఎం రాజేశ్వరీ, గ్రామ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఆయా అంగన్‌వాడీ సెంటర్లలో పోషక మహోత్సవాలు నిర్వహించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఈ నెల 30 వరకు మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. చిన్నారుల ఎత్తు, బరువు చూసి, లోపం ఉన్న చిన్నారులకు అందించే పోషకాహారాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా అంగన్‌వాడీ టీచర్లు మంజుల, మాధవి, రేఖ, మనోరంజని, లక్ష్మి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ సేవలు మరువలేం

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆయా పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. తెలుగు భాష అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేమని కొనియాడారు.



పాపన్నపేటలో..



నర్సాపూర్ ఆర్‌డీఓ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి



నిజాంపేట(మెదక్): రాంపూర్ గ్రామంలో..



టేక్మాల్(మెదక్): తహసీల్దార్ కార్యాలయంలో..



హవేళిఘణాపూర్: కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నర్సాపూర్‌రూరల్: డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ దామోదర్

బీసీలకు అవకాశం ఇవ్వండి

మనోహరాబాద్(తూప్రాన్): నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని జిల్లా బీసీ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం ఈ సందర్భంగా కాళ్లకల్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియామకం చేయడం సంతోషకరమన్నారు. ఇదే విధంగా మెదక్ జిల్లాలో సైతం నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. గ్రంథాలయ చైర్మన్, తదితర వాటిల్లో వారికి అవకాశం కల్పించాలని నాయకులను కోరారు.

బియ్యం సరఫరాపై వివరాల సేకరణ



రాంపూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న గోదాం ఇన్‌చార్జి దత్తురెడ్డి

అల్లాదుర్గం(మెదక్): నాసిరకం బియ్యం మాకొద్దని రాంపూర్ రేషన్‌షాపు ఎదుట నిరసన చేసిన వినియోగదారుల కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. జిల్లా పౌరసరఫరా శాఖ టెక్నికల్ అధికారి ప్రశాంత్, పెద్దశంకరంపేట పౌరసరఫరా గోదాం ఇన్‌చార్జి దత్తురెడ్డి రాంపూర్ గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఇలాంటి బియ్యం మీ ఇంట్లో తింటారా అంటూ స్థానికులు అధికారులను ప్రశ్నించారు. అధికారులు స్పందిస్తూ.. పాత బియ్యం కావడంతో తొడుతో జాలి కట్టాయని, పాత బియ్యమే చాలా మంది కొనుగోలు చేస్తారని అధికారులు చెప్పి సమర్థించుకున్నారు. మండలంలో ఒక్కో గ్రామానికి ఒక్కో రకం బియ్యం సరఫరా చేస్తున్నారని అన్నారు.

తెలంగాణ యాసను వీడొద్దు



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

హవేళిఘణాపూర్(మెదక్): తెలంగాణ యాస, భాషను మరవకూడదని హవేళిఘణాపూర్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కరుణాకర్ అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవసరానికి మాత్రమే అన్య భాషలు నేర్చుకోవాలని, అన్నింటా అమ్మ భాషను ఉపయోగించాలని అన్నారు. పత్తి పాక ఫౌండేషన్, గరిపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలలో కథలు, కవితలు, చిత్రాలు తదితర అంశాల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్యామల, రవీందర్, దేవుల, మధుసూదన్, అశోక్, రాజేశం, ఎల్లమ్మ, రమేశ్, బస్వరాజ్ తదితరులు ఉన్నారు.

రైతులకు స్ప్రేయర్ల అందజేత



స్ప్రేయర్‌లు అందిస్తున్న సెహగల్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కసాన్‌పల్లి గ్రామంలోని మహిళా రైతులకు సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్ప్రేయర్‌లతో పాటు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. హైటెక్ సీడ్ ప్రతినిధి పీవీఎస్‌పీ శర్మ మాట్లాడుతూ.. సెహగల్ ఫౌండేషన్ సలహాలు సూచనలతో అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. డ్రమ్ సీడ్ పద్ధతిలో వేసిన వరి పంట ఎదుగుదల గురించి శర్మ రైతులను అడిగి తెలుసుకున్నారు. ఫౌండేషన్ లీడ్ వాణి మాట్లాడుతూ.. మహిళా రైతుల మెరుగైన జీవనశైలి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెహగల్ ప్రతినిధులు అవినాష్, విజయ్, శ్రవణ్‌తో పాటు గ్రామ రైతులు ఉన్నారు.

పాఠశాలలో బాల కవుల సమ్మేళనం



నర్సాపూర్: ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని విష్ణు పాఠశాలల్లో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించామని పాఠశాల ప్రిన్సిపాల్ జామి, వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ తెలిపారు. విద్యార్థులకు తెలంగాణ భాష గొప్పతనం, సాహిత్య సేవ అంశాలపై బాల కవుల సమ్మేళనం, ఉపన్యాస పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు



నర్సాపూర్‌లో గణపతి పూజల్లో పాల్గొన్న హిందువులు, ముస్లింలు

నర్సాపూర్: నవరాత్రులను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వినాయకుడికి హిందువులు, ముస్లింలు కలిసి పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీ ఒకటవ వార్డులోని జగన్నాథరావు కాలనీలో గంధర్వసేన ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతికి సోమవారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు, ముస్లింలు హైమద్, ఆబేద్, హమేద్, వాజిద్, జమీర్, జహీర్ కలీం, సలీం తదితరులు పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా కాలనీలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా మంటపాలను ఎస్ఐ.శంకర్ పర్యవేక్షిస్తూ సూచనలు ఇచ్చారు.

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా గణేశ్ మంటపాల వద్ద ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు. సంగాయిపేటలోని గణేశ్ మంటపం వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.



పెద్దశంకరంపేట(మెదక్): మాధవనగర్ కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు



మెదక్ కలెక్టరేట్: పూజల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



కొడిపల్లి పెద్ద చెరువు వద్ద వినాయకుడితో యువకులు



కొడిపల్లి (నర్సాపూర్): గురుకుల పాఠశాలలో వినాయక శోభాయాత్రలో విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ **దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ**



పాపన్నపేట(మెదక్): మండలంలోని ఎల్లాపూర్‌కు చెందిన యముడాల రమేశ్ పుట్టుకతో దివ్యాంగుడు. ఇంటికే పరిమితమైన తనకు బయట ప్రపంచాన్ని చూపాల్సిందిగా అధికారులను కోరుకున్నప్పటికీ అతనికి సహాయం అందలేదు. దీంతో అదే గ్రామానికి చెందిన యువజన నాయకుడు మల్లేశ్ సోమవారం కలెక్టర్ రాహుల్ రాజ్ వద్దకు వెళ్లి అతని దీనస్థితిని వివరించాడు. స్పందించిన కలెక్టర్ వెంటనే అతనికి ట్రైసైకిల్ ఇప్పించాడు.

◆ **రుణమాఫీ సర్వే**

చిన్నశంకరంపేట(మెదక్): రుణమాఫీ సర్వే కొనసాగుతుందని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రవీణ్ అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట రైతు వేదికలో రైతుల కుటుంబ నిర్ధారణ ప్రక్రియతో పాటు రైతుల ఫిర్యాదులు స్వీకరించారు.

◆ **ఎమ్మెల్యేను కలిసిన అంబాజీపేట కురుమలు**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజీపేట కుర్మ సంఘం నాయకులు అలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఐలయ్యను కలిశారు. సోమవారం హైదారాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కుర్మలకు అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో భూమయ్య, సంఘం నాయకులు ఉన్నారు.

◆ **ఆటల పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నాలి**

మనోహరాబాద్(తూప్రాన్): మండల స్థాయిలో ఈ నెల 12 నుంచి 14 వరకు కోకో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు మనోహరాబాద్ ఉన్నత పాఠశాల పీడీ మంజుల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

◆ **నష్టపరిహారం చెల్లించాలి**

మెదక్ కలెక్టరేట్: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కేవలం కిషన్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన బాధితులకు రూ.40 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బస్వరాజ్, మల్లేష్, దుర్గేష్, కమల, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

◆ **కరెంట్ షాక్‌తో పాడి గేదె మృతి**



నర్సాపూర్ రూరల్: కరెంట్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని రామచంద్రపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగం సత్తయ్యకు చెందిన పాడిగేదె రోజులాగే మేత కోసం తీసుకెళ్లాడు. మేత మేస్తూ.. అక్కడే ఉన్న కరెంట్ స్తంభానికి ఉన్న సపోర్టింగ్ తీగతో షాక్‌కు గురై మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరారు.

◆ **పాఠశాల పరిశీలన**

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు పాఠశాలలను మండల నోడల్ అధికారి నీరజ సోమవారం సందర్శించారు. మండలంలోని గొల్లపల్లి, కరీంనగర్ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

◆ **కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ**

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కుకునూర్‌పల్లి మండలం ఎల్లాయిగూడకు చెందిన పార్టీ కార్యకర్త మాసపాక స్వామి కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. పార్టీ ప్రమాద బీమా ఉండడం వల్ల పార్టీ నుంచి రూ. 2 లక్షల బీమా చెక్కును సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 360 మందికి పార్టీ ప్రమాదబీమా ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు దేవి రవీందర్, లక్ష్మణ్‌రాజ్, కనకయ్య, శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.